www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

సోమవారం | 05 | అక్టోబర్ | 2026 పేజీలు : 8

## మూడేళ్లుగా నిరుపయోగంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు?




-పేదలకు సొంత గూడు కరవు
-అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు
-లబ్ధిదారుడి స్థితిపై విచారణ చేయాలంటున్న కిష్టాపురం ప్రజలు

2 లో

# నెర్రెలు బారిన వరి పొలం..!



-అడుగంటుతున్న భూగర్భ జలాలు
-పశువులకు మేతగా పంట పొలాలు
-ఆందోళనలో రైతులు



ప్రజాపక్షం/వైరాః పచ్చగా కళకళలాడాల్సిన వరి పొలంలో ఇప్పుడు పశువులుమేత మేస్తున్నాయి. నెలలు తరబడి కష్టపడి సాగు చేసిన పంటకు నీరందక ఎండిపోవడంతో దాన్ని కాపాడుకోలేక చివరకు అదే పంటను పశువులకు మేతగా వదిలేయాల్సిన దుస్థితి ఓ అన్నదాతకు ఎదురైంది. పంటను చూస్తూ కన్నీరు పెట్టుకోవడం తప్ప ఏమి చేయలేని పరిస్థితి. వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో కనిపిస్తున్న ఈ దృశ్యం అన్నదాతల కష్టాలకు అద్దం పడుతుంది. వైరా మున్సిపాలిటీ లాలాపురంకు చెందిన రైతు పాషా

మిగతా 2లో..

## ప్రజలకు మెరుగైన సదుపాయాలు
# కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/ఎర్రుపాలెం : ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. మండలంలో గ్రామీణ రహదారులు, ఎస్సీ కాలనీల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొత్తం రూ.12.89కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నారు.

మిగతా 2లో..

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎర్రుపాలెం మండలంలో రూ.12.89 కోట అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## పేదల సంక్షేమమే
# ప్రభుత్వం లక్ష్యం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : పేద ప్రజల సంక్షమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంనగరంలోని క్యాంపు కార్యాలయంలో ఖమ్మంరూరల్, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,

**కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి**

షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఖమ్మంరూరల్ మండలంలో 51మంది లబ్ధిదారులకు రూ.50,05,500ల

మిగతా 2లో..

## గిరిజన దర్బార్, ప్రజావాణి సరే..
# సత్ఫలితాల ఎక్కడ..?




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలు కేవలం అర్జీలకే పరిమితం అవుతున్నాయా..? సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా

మిగతా 2లో..

- అర్జీల స్వీకరణకే పరిమితమవుతున్న వైనం?
- సమస్యల పరిష్కార నివేదికల్లో స్పష్టత కరవు
- పదేపదే వస్తున్న ఫిర్యాదులు
- పరిష్కారంపై పర్యవేక్షణ ఏదీ ?

# ఖమ్మంరూరల్‌కు ఎల్‌నినో ముప్పు..!



**- వర్షాపాతం తగ్గుముఖంతో నీటి నిల్వలపై ఆందోళన**
**- అధికారులు ముందస్తు చర్యలపై ప్రశ్నలు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఖమ్మంరూరల్ మండలం పరిధిలోని పలు ప్రాంతాల్లో నీటి నిల్వలపై ఆందోణ నెలకొంటోంది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో చెరువులు, ఇతర నీటి వనరుల్లో చేరాల్సినంత నీరు చేరలేదనే పరిస్థితి కనిపిస్తోంది..

### గత ఏడాదితో పోలిస్తే భారీ తేడా..

గత ఏడాదితో పోలాస్తే ఈ సారి ఖమ్మం జిల్లాలో వర్షపాతం గణనీయంగా తగ్గింది. జూన్ 1నుంచి సెప్టెంబర్ 29వరకు 2026లో ఖమ్మం జిల్లా కేంద్రంలో 421మి,మీ వర్షపాతం నమోదుకాగా. గత ఏడాది ఇదే కాలంలో 740మి.మీ వర్షం కురిసింది. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈసారి దాదాపు 43శాతం వర్షపాతం తగ్గింది. ఈ లోటు నీటి వనరులపై ప్రభావం చూపే అశకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సాధారణంగా వర్షాకాలంలో కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు నిండటంతో పాటు భూగర్భ జలాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఆ నీటి నిల్వలే అనంతరం వచ్చే వేసివి నెలల్లో తాగునీరు. సాగునీటి అవసరాలకు కొంతవరకు ఆధారంగా నిలుస్తాయి. అయితే ఈ సారి ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు ఏర్పడకపోతే వచ్చే వేసవిలో నీటి అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

### అధికారుల ముందస్తు చర్యలే కీలకం

ఈ నేపథ్యంలో ఏదులాపురంమున్సిపాలిటీతో పాటు ఖమ్మంరూరల్ మండలంలో అధికారులు నీటి వనరుల ప్రస్తుత పరిస్థితిపై సమగ్రంగా అంచాన వేయాల్సిన అవసరం ఉంది. చెరువులు, కుంటల్లో ప్రస్తుతం ఎంత నీరు ఉంది? భూగర్భజలాల పరిస్థితి ఎలా ఉంది? వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఎలాంటి ప్రయత్యామ్నాయ వనరులపై అధికారుల కార్యాచరణ సిద్ధం చేస్తేనే భవిష్యత్ నీటి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉటుంది. ప్రస్తుత వర్షపాత లోటు నేపథ్యంలో అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు చేపడతారో వేచి చూడాల్సి ఉంది.

# బత్తినేని ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య క్యాంపు విజయవంతం



**-ఎముకలు, కీళ్ల సమస్యలకు అధునాతన చికిత్సలు**
**-నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు..**
**తొలిదశలోనే వైద్యులను సంప్రందించాలి**
**-కొంగర సృజన్ మల్టీస్పెషాలిటీ అధినేత,**
**ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణులు కొంగర రాకేష్**



**ప్రజాపక్షం/బోనకల్:** సిపిఐ సీనియర్ నాయకులు, అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల మొదటి ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మండల కేంద్రంలో ప్రకాశరావు భవన్‌లో నిర్వహించిన 73వ బిపీ, షుగర్ ప్రత్యేక వైద్య క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఈ క్యాంపుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కొంగర సృజన్ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ అధినేత, ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కొంగర రాకేష్ మాట్లాడుతూ ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా బిపీ, షుగర్ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించారు. ఎముకలు, కీళ్ల సమస్యలకు అధునిక వైద్య విధానాలతో మెరుగైన చికిత్సలు అందుబాటులో వచ్చాయని తెలిపారు. మోకాళ్లు, తుంటి కీళ్ల మార్పిడి, ఆర్థ్రోస్కోపీ, ఫ్రాక్చర్లు, లిగమెంట్ గాయాలు, వెన్నెముక సమస్యలకు అధునాతన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పి, కీళ్ల వాపు, కదలికల్లో ఇబ్బందులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా తొలిదశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రమాదాల్లో గాయాలు, ఫ్రాక్చర్లు సంభవించినప్పుడు స్వయంగా చికిత్స చేయకుండా నిపుణుల సలహా తీసుకోవాలని కోరారు. కొంగర సృజన్ మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌లో మండల ప్రజలకు ఉచిత ఓపీ, ఉచిత ఎక్స్‌రే, రక్తపరీక్షల్లో 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఎముకలు, కీళ్లు, కిడ్నీ తదితర వ్యాధులకు ఆరోగ్యశ్రీ వైద్య సౌకర్యం అందుబాఉటులో ఉందని, ఈ సదవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో సుమారు 100 మంది పేషంట్లకు బిపీ, షుగర్, జనరల్ వైద్య నిపుణులు టి పవన్‌కుమార్, డాక్టర్ కొంగర రాకేష్ వైద్యపరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తూము ప్రకాశరావు, ఆర్ఎంపీడబ్ల్యుఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావులు చేతుల మీదుగా పేషంట్లకు మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు డాక్టర్ టి పవన్‌కుమార్, డాక్టర్ కొంగర రాకేష్‌లను క్యాంపు నిర్వహణ కమిటీ శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కొంగర సృజన్ హాస్పటల్ మేనేజ్‌మెంట్ కొంగర పూర్ణచంద్రరావు, సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, మాతంగి శ్రీనివాసరావు, యంగల గిరి, జానకీపురం మాజీ సర్పంచ్ చిలకా వెంకటేశ్వర్లు, కొంగర సృజన్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ నిశిత, సిబ్బంది త్రివేణి, అపర్ణ, వెంకట్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో పారిశుధ్ధ్య పనులు ముమ్మరం

**-12వ వార్డులో చెత్త తొలగింపు**
**-7వ వార్డులో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సత్తుపల్లి మున్సిపాలిటీ చైర్మన్ రెహానా కమల్ పాషా బేగం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 12వ వార్డు విరాట్ నగర్ నుంచి సింగరేణి కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను జేసీబీ సహాయంతో తొలగిస్తున్నారు. ఈ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా ఆదివారం పర్యవేక్షించారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో గత 22 సంవత్సరాలుగా రోడ్డు, డ్రైనేజీ సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికుల సమస్య ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దృష్టికి వెళ్లడంతో, ఆమె ఆదేశాల మేరకు రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో 7వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా, వార్డు కౌన్సిలర్ నసీమా షరీఫ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం అందించేందుకు మున్సిపాలిటీ చర్యలు తీసుకుంటుందని రిహానాకమల్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ నసీమా షరీఫ్, 12వ వార్డు కౌన్సిలర్ విజయ్ కాంగ్రెస్ నాయకులు గుడ్లూరి రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం ఖమ్మం నగరంలోని మంచికంటి భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా, రాష్ట్ర ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ బాధ్యులు, సభ్యులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా హిమబిందు, ప్రధాన కార్యదర్శిగా హన్మంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా శ్రీరామనేని రామారావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన హిమబిందు, హన్మంతరావు, శ్రీరామనేని రామారావు లు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ కోసం తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## వీటీసీ ఇన్‌స్ట్రక్టర్‌గా ఎంపికైన ఏఐటీయూసీ నాయకుడు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జేవీఆర్ ఓసీలో ఓవర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఐటీయూసీ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ పి.సూర్యప్రకాష్ సత్తుపల్లి వీటీసీ ఇన్‌స్ట్రక్టర్‌గా ఎంపికయ్యారు. గత నెల నిర్వహించిన ఇంటర్నల్ రాత పరీక్షకు ఎనిమిది మంది హాజరుకాగా, తన ప్రతిభతో సూర్యప్రకాష్ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఏఐటీయూసీలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జేవీఆర్ ఓసీ నుంచి వీటీసీ కి వెళ్తున్న సూర్యప్రకాష్‌ను ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు ఆదివారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ డి.బీమయ్య, ఫిట్ కార్యదర్శి జి.నరసింహారావుతో పాటు పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## రెండు లారీల ఢీ.. క్లీనర్‌కి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని లంకాసాగర్ క్రాస్ రోడ్ వద్ద ఆదివారం కొత్తగూడెం నుండి సత్తుపల్లి కి బొగ్గులోడు కోసం వెళ్తున్న టిప్పర్ సత్తుపల్లి నుండి ఖమ్మం వైపు వెళ్తున్న డిసియం పాలవ్యాన్ ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ సంఘటనలో రెండు వాహనాలు ఎదుటి భాగం పూర్తిగా ధ్వంసమయ్యాయి. పాల వ్యాన్ కి చెందిన క్లీనర్ కోటిరెడ్డి వెంకటరెడ్డి కు తీవ్ర గాయాలు కావడంతో పెనుబల్లి వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ కి అంతరాయం లేకుండా క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సర్‌ను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** భారత రాజ్యాంగం పై విశ్వాసం లేని బీజేపీ ప్రభుత్వం చేపట్టే పౌరుల ఓటుహక్కును తొలగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా డిమాండ్ తో ఆదివారం పెనుబల్లి మండలం వంగా ముత్యాల బంజరలో సమావేశం జరిగింది. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) కు వ్యతిరేకంగా అక్టోబర్ 6న కలెక్టరేట్ కార్యక్రమం ముందు ధర్నాతో పాటు అక్టోబరు 8 న చలో రాజ భవన్, నవంబరు ఒకటిన చలో ఢిల్లీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ (ఎం), సీపీఐ, ఎం ఎల్ మాస్ లైన్ నాయకులు చలమాల విఠల్ రావు, పొదిల భాస్కర్, బీరెల్లి లాజర్, కాటినేని శ్రీనివాసరావు, చిట్టిమోదుల కృష్ణ, రాధా కృష్ణ, ఈడా కమలాకర్ రావు, కీసర శ్రీనివాసరెడ్డి, గూడూరు మాధవ రెడ్డి, మేకతొట్టి కాంతయ్య, తాళ్లూరి శేఖర్, వంగా గిరిజాపతిరావు, వంగా చంద్ర శేఖర్, అరుణ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదం



**ప్రజాపక్షం/మధిర:** భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ధాతల సహకారంతో అన్నదనాం నిర్వహించబడును. అందులో భాగంగా గంగిశెట్టి లక్ష్మయ్య ధర్మవతి వరలక్ష్మి జ్ఞాపకార్థం మనుమడు మహేష్, సోదరి, దుర్గామాధురి, తూములూరి పాండు రాంగారావు జ్ఞాపకార్థం ధర్మపత్నిఅన్నపూర్ణ,జ్ఞానసింధు సహాయంతో అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలోచీకటి నాగేశ్వరరావు, కోనలక్ష్మీ మోహన్‌రావు, కపిలవాయి జగన్మోహన్‌రావు,చారుగుండ్లవెంకటలక్ష్మి , నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసి కార్మికులకు అన్యాయం చేసిన అశ్వత్థామ రెడ్డి




**-ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం రీజియన్ గౌరవాధ్యక్షులు బిజి క్లెమెంట్ ఆరోపణ**
**-ఆర్టిసి పరిరక్షణ కోసం ఎంప్లాయీస్ యూనియన్ కూటమిని గెలిపించాలని కార్మికులకు అభ్యర్థన**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్టిసి కార్మికుల సంక్షేమాన్ని కాపాడాల్సిన నాయకులే తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని మోసం చేసి అన్యాయం చేశారని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయు) ఖమ్మం రీజినల్ గౌరవాధ్యక్షులు బిజి క్లెమెంట్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మంలో జరిగిన రీజినల్ డిపో కార్యదర్శుల కార్మిక సమావేశం ఆదివారం ఏఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అశ్వత్థామరెడ్డి కార్మిక నాయకుని ముసుగులో కార్మికులకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. కష్టకాలంలో కార్మికులకు అండగా ఉండాల్సిన నాయకత్వమే యాజమాన్యంతో కుమ్మక్కై , హక్కులను కాలరాసేలా వ్యవహరించిందని ఆయన విమర్శించారు. కార్మికుల జీతభత్యాలు, పిఆర్‌సి, పెండింగ్ డిమాండ్ల సాధనలో అశ్వత్థామరెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆయన వ్యక్తిగత అజెండా వల్లే ఆర్టిసి కార్మిక లోకం తీవ్రంగా నష్టపోయిందని స్పష్టం చేశారు. కార్మికుల ముసుగులో చలామణి అవుతూ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించే నాయకులను ఇకపై సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఆర్టిసి కార్మికులు, కార్మిక సంఘాలు ఇప్పటికైనా అప్రమత్తమై మోసపూరిత నాయకత్వాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల నిజమైన హక్కుల సాధన కోసం, వారి సంక్షేమం కోసం ఎంప్లాయీస్ యూనియన్ ఎల్లప్పుడు ముందుంటుందని కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగినా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈనెల తొమ్మిదిన జరిగే ఆర్టిసి కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్, టిఎంయు, ఎన్ఎంయు కూటమిగా ఏర్పడి పాల్గొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ బస్సు గుర్తుపై పోటీ చేస్తుందని కార్మికులందరూ అధిక సంఖ్యలో బస్సు గుర్తుకు ఓటేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి రమేష్, బొడా వీరన్న, కార్యదర్శి నకిరికంటి కృష్ణ, డిపో కార్యదర్శి బుచ్చిబాబు, ప్రచార కార్యదర్శి జేకే, కోశాధికారి లాజర్, వల్లపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-17 క్రికెట్‌కు ప్రతీక చౌదరి ఎంపిక



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కె. ప్రతీక చౌదరి రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్17 బాలికల క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన సెలక్షన్‌లో ప్రతీక ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఆమె ఎంపికపై ప్రధానోపాధ్యాయులు డి. రామిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు డి. వరలక్ష్మి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

# భద్రమ్మకు నివాళులర్పించిన కందాళ



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం గోపాలరావుపేటకు చెందిన మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ తల్లి భద్రమ్మ ప్రథమ వర్థంతి కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఏ కందాల ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. భద్రమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఇంటూరి శేఖర్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. భద్రమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, పాల్గొన్నారు.

# 12 మంది విద్యార్థులపై హెచ్‌ఎం దాడి



**-గాంధీ జయంతి రోజు అల్లరికి గూండాగిరి శిక్ష**
**-రామానుజవరం జెడ్పీ స్కూల్ లో ఘటన**



**ప్రజాపక్షం/మణుగూరు:** 12 మంది విద్యార్థులపై హెచ్ఎం దాడి చేయదంతో బలమైన వాతలు తేలిన దారుణ సంఘటన మణుగూరు మండలం రామానుజవరం జెడ్పీ హైస్కూల్ లో చోటు చేసుకుంది. గాంధీ జయంతి రోజు పక్క స్కూల్ లో ఐరన్ పోల్ విరగొట్టారని ప్రైమరీ టీచర్ ఫిర్యాదు చేయడమే కారణం. దీన్ని మనసులో పెట్టుకున్న ప్రధానోపాధ్యాయురాలు యశోద పిల్లలపై ప్రతాపం చూపింది. దెబ్బలకు తట్టుకోలేక విద్యార్థులు ఏడుస్తున్నా వినలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇంటికి వెళ్లాక పిల్లల ఒంటిపై వాతలు చూసి తల్లిదండ్రులు షాక్ అయ్యారు.ఉన్న పిల్లల ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం గమనార్హం.

**తలుపులు మూసి వీర బాదుడు...**

తరగతి గది తలుపులు మూసి మరీ పై పుతో దాడి చేశారని, బయటకు వచ్చే టప్పటికి ఒంటిపై చారలు, వాతలతో పిల్లలు బిక్కచచ్చిపోయారని తోటి వి ద్యార్థులు చెబుతున్నారు. ఇంట్లో తల్లి దండ్రులు బట్టలు మార్చే సమయంలో గాయాలు చూసి నివ్వెరపోయారు. పగబట్టి కొట్టినట్లు ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల అంటే పేద పిల్లలు చదువు కునే చోటు.. అలాంటి చోటభయాన్ని సృష్టిస్తే పిల్లలు బడికి ఎలా వ స్తారని ప్రశ్నిస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్ర కారం పిల్లలను కొట్టడం నేరమని, అలాంటిది హెచ్ఎం స్థాయి వ్యక్తే చట్టా న్ని ఉల్లంఘించడం సిగ్గుచేటని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. వెంటనే డీఈఓ స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అంజనేయులుకు జాతీయ ఉత్తమ పోటోగ్రాఫర్ అవార్డు



**ప్రజాపక్షం/బోనకల్:** నగరానికి చెందిన ప్రజాపక్షం పోటో జర్నలిస్టు అతూరి ఆంజనేయులుకు జాతీయ ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డు లభించింది. భారత్ కళా పురస్కార్ 2026 అవార్డులో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఫోటోట్రేడ్ ఎక్స్‌పోలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా ఆంజనేయులు అవార్డును అందుకున్నారు. స్వతంత్ర ఫోటో జర్నలిస్టుగా, ప్రజాపక్షం ఫోటో జర్నలిస్టుగా ఆంజనేయులు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. గతంలోనూ ఆయనకు పలు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా ప్రజాపక్షం ఖమ్మం, భద్రాద్రి జిల్లా బ్యూరో ఏనుగు వెంకటేశ్వరరావు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మారగాని వెంకట్‌గౌడ్, జిల్లా బాధ్యులు నేరేడు తిరుపతిరావు, కమటం రఘు, మల్లెల సతీష్, ఓమెగా శ్రీకాంత్ తదితరులు ఆంజనేయులను అభినందించారు.

# 44ఏళ్ల తర్వాత ఒక్కటైన ఆత్మీయ బంధం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మానవ సంబంధాలు దూరమవుతున్న సమయంలో నాలుగు దశాబ్దాలకు పైగా కాలం గడిచినా చెదరని స్నేహబంధం వారిని మళ్లీ ఒక్కచోట చేర్చింది. సుబ్లేడు ఉన్నత పాఠశాలలో 197681 సంవత్సరాల మధ్య చదువుతున్న పూర్వ విద్యార్థులు 44 సంవత్సరాల తర్వాత అప్పుడు చదివిన అదే సుబ్లేడు పాఠశాలలో ఆత్మీయంగా ఆదివారం కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. దాదాపు అందరూ ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రైవేట్ రంగాల్లో వ్యాపారాలల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు అందరూ పదవీవిరమణ పొందారు. వారి కుటుంబ బంధాలను తెలియజేస్తూ స్నేహితులతో సంతోషంగా గడిపారు. 44ఏళ్ల విరామం తర్వాత కలుసుకున్న స్నేహితుల్లో ఆనందం ఎల్లలు దాటింది. కొందరు భావోద్వేగానికి లోనై చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమ్మేళనం తమ జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. దూరాలు పెరిగినా..నిజమైన స్నేహానికి ఎల్లలు ఉండవని ఈ ఆత్మీయ సమ్మేళనం మరోసారి చాటి చెప్పింది. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయుడు విఠల్‌రావు, రాధాబాయి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శశిధర్, వెంకటేశ్వరరావు, అస్గర్‌ఖాన్, ప్రసాద్, భువనగిరి వెంకటేశ్వర్లు, డీలర్ వెంకన్న, రామ్‌రెడ్డి, శారద, చంద్రకళ, విజయ్‌కుమార్, రాగ్య నాయక్, శ్రీరాములు, గంగశ్రీ లాలయ్య, గంధసిరి మల్లయ్య, సీత తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు సింగరేణి ఎస్సీ సివిల్ కాంట్రాక్టర్ల నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి సంస్థలో సివిల్ కాంట్రాక్టర్లుగా కొనసాగుతున్న ఎస్సీ కమ్యూనిటీకి చెందిన కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఐక్యత కోసం నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు ఎన్నికలు నిర్వహించారు. మణుగూరులో జరిగిన ఈ ఎన్నికల్లో ఎస్సీ కమ్యూనిటీకి చెందిన సింగరేణి సివిల్ కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంట్రాక్టర్లకు ఎదురవుతున్న సమస్యలను సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం, పనుల విషయంలో సమాన అవకాశాలు కల్పించేలా కృషి చేయడం, కాంట్రాక్టర్ల హక్కుల కోసం సంఘటితంగా పోరాడడం నూతన కమిటీ ప్రధాన లక్ష్యాలుగా నాయకులు తెలిపారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంట్రాక్టర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టర్లందరిని కలుపుకొని, ఎస్సీ కమ్యూనిటీకి చెందిన సివిల్ కాంట్రాక్టర్ల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో కాంట్రాక్టర్లకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్చల ద్వారా కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే కాంట్రాక్టర్ల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా రాజ్ వీర్, గౌరవ సలహాదారుగా మునిగెల రమేష్, అధ్యక్షులుగా కటుకూరి శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులుగా ముసలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శనిగారపు సునీల్, కార్యదర్శిగా గోవింద శ్రీనివాస్, కోశాధికారిగా చింతమల్ల రమేష్ తో పాటు మరో 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి సివిల్ కాంట్రాక్టర్లు, సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మండలంలో ముదురు ప్రగళ్లపల్లి పంచాయితీ పరిధిలోని కె వీరభద్రపురంలో డీసీఎంఎస్ వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ తుర్రం నవీన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ ఎస్ రవి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చే ముందు తేమ శాతం 17శాతంలోపు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆధార్, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో పాటు క్లస్టర్ ఏఈఓ వద్ద నుంచి టోకెన్ తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 7 సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ 2,461 మద్దతు ధరతో పాటు రూ 500 బోనస్ అందుతుందని, ఇతర రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ 2,441 మద్దతు ధర చెల్లిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో డీసీఎంఎస్ సూపర్‌వైజర్ ఆదివిష్ణు, గ్రామస్తులు ఉప్పు అశోక్, అచ్చిరాజు పాల్గొన్నారు.

# పర్ణశాలలో ఘనంగా పునర్వసు కళ్యాణం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని పర్ణశాల పుణ్యక్షేత్రంలోని శ్రీస్వామివారి కళ్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి వేదమంత్రాలు, మేళతాళాల మధ్య కళ్యాణ వేడుక నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు లిఫ్ట్ ప్రాంతం పరిశీలన

## -త్వరలో పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం
## -ఎంఎల్ఏలు కోరం కనకయ్య, భూక్యా మురళీనాయక్





ప్రజాపక్షం/ఇల్లందు: ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజక వర్గాలకు సీతారామ ప్రాజెక్టు నీటిని అందించేందుకు కారేపల్లి మండలం చీమలపాడు గ్రామ శివారులోని పాపకొల్లు గండ్ల వద్ద ప్రతిపాదించిన లిఫ్ట్ ప్రాంతాన్ని ఎంఎల్ఏలు కోరం కనకయ్య, భూక్యా మురళీనాయక్ శనివారం కాలినడకన వెళ్లి పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి మ్యాప్‌ను పరిశీలించి నీటి ప్రవాహ మార్గాలపై చర్చించారు. ఎంఎల్ఏ కనకయ్య మాట్లాడుతూ మూడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించే అంశాన్ని ఇప్పటికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గతంలో నీరు అందిస్తామని హామీ ఇచ్చిన అమలు చేయలేదని మాజీ సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో సీతారామ జలాలను ఇల్లందు ప్రాంతానికి తీసుకురావడంతో పాటు త్వరితగతిన నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించేందుకు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి అంశాన్ని తీసుకెళ్తామని ఎంఎల్ఏలు తెలిపారు. ఈకార్యక్రమంలో చీమలపాడు సర్పంచ్ మాలోత్ లలిత, భావుసింగ్, మహబూబాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతి రమేష్, బయ్యారం మాజీ సొసైటీ ఛైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య, గబ్రు నాయక్, వెల్పుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంపులో పడి బాలుడు మృతి





ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఇంటి నిర్మాణం కోసం తీసివదిలిన నీటి సంపు ఓ బాలుడి మృతికి కారణమైంది. ఈవిషాద ఘటన ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని ప్రకాశ్‌నగర్ కుమ్మరి కాలనీలో ఆదివారం చోటుచుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం దమ్మపేటకు చెందిన సోమవరపు సాయి, ఖమ్మం త్రీటౌన్ ప్రాంతాని చెందిన ఉమా దంపతులకు ఇద్దరు సంతానం. మొదటి సంతానం సోమవరపు గగన్‌ఉమేష్ (4)కాగా ఇటివల తల్లి ఉమా గర్భందాల్చడంతో అమ్మగారిల్లు అయిన ఖమ్మం డెలివరికీ వచ్చింది. ఇటీవల ఆమెకు పాప పుట్టింది. ఆసుపత్రి నుంచి డిశ్చార్ అయిన ఉమా తల్లిగారి వద్ద ఉంటుండగా ఆమె వెంట కొడుకు గగన్‌ఉమేష్ ఉన్నాడు. ఈ క్రమంలో తల్లిగారి ఇంటి పక్కనే సురేష్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. నీటి కోసం సంపు తవ్వి ముతపెట్టకుండా వదిలేశాడు. ఆదివారం ఆటకు బయటకు వచ్చిన ఉమేష్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతకగా సంపులో విగత జీవిగా కనిపించాడు. వెంటనే స్థానికుల సహాయంతో బయటికి తీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంటి పక్కవారు నిర్లక్ష్యంగా సంపుపై మూతపెట్టకపోవడం వల్లనే తనకుమారుడు అందులో పడి మృతిచెందాడని ఆఇంటి యజమానే తనకోడుకు మృతికి బాధ్యత వహించాలని బాధితురాలు ఉమా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పెర్కొంది. ఘటన స్థలానికి చెరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికీ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ చిట్టిబాబు తెలిపారు. అప్పటి వరకూ అందరితో కలిసి ఆడుకున్న కొడుకు కళ్ల ఎదుటే దుర్ఘటనలో మృతిచెందడంతో తల్లి రోధనలతో విషాదచాయలు అలముకున్నాయి. తన బిడ్డ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేస్తోంది.

# ఫొటోగ్రాఫర్ ముత్యాల నాగేశ్వరరావుకు అవార్డు

## భారత్ కళా పురస్కార్ 2026తో మరో గౌరవం






ప్రజాపక్షం/వైరా: ఫొటోగ్రఫి రంగంలోవిశేష ప్రతిభ కనబరుస్తున్న వైరాకు చెందిన ముత్యాల నాగేశ్వరరావకు జాతీయ స్తాయిలో అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ శంషాబాద్‌లోని ఎస్ఎస్. కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల2,3,4 తేదీల్లో నిర్వహిస్తున్న ఫొటో ట్రేడ్‌షో సందర్భంగా జరిగిన జాతీయ స్థాయి వెడ్డింగ్ ఫొటోగ్రఫి పోటీల్లో ఆయన ఉత్తమ వెడ్డింగ్ ఫొటోగ్రఫి అవార్డుతో పాటు భారత్ కళా పురస్కార్ 2026కు ఎంపికయ్యారు. సిగ్మా ఫొటోగ్రఫి అకాడమీ ఆఫ్ ఇండియా, ట్రేడ్ షో నిర్వాహకులు సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. అందులో ముత్యాల నాగేశ్వరరావు ప్రతిభను గుర్తించి రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలకు ఎంపిక చేశారు. నిర్వాహకులు, ఫొటోగ్రఫి పరిశ్రమకు చెందిన ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ వెడ్డింగ్ ఫొటోగ్రఫి అవార్డు భారత్ కళా పురస్కార్ 2026 అందుకోవడం తనకు ఎంతో ప్రత్యేకమైన విషయమన్నారు. తన ప్రతిభను గుర్తించి పురస్కారాలతో సత్కరించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఫొటోగ్రఫి ప్రయాణంలో ప్రోత్సాహం , సహకారం అందిస్తున్న ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిగ్మా ఫొటోగ్రఫి అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎంసి.శేఖర్, ట్రేడ్ షో నిర్వాహకులు ఎడిట్ పాయింట్ రమేష్, ఫొటోటెక్ అధినేత అభిమన్యరెడ్డి తదితరులతో పాటు దేశవ్యాప్తంగా వేలాది మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# పీఆర్సీపై కాలయాపన తగదు

## -వెంటనే పీఆర్సీ ప్రకటించాలి
## -సింగరేణిలో 13వ మహాసభ, నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




ప్రజాపక్షం/కారేపల్లి: తెలంగాణ రెండో పీఆర్సీ అమలులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని, వెంటనే పీఆర్సీ ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జరిగిన సింగరేణి మండల 13వ మహాసభలో ఆయన మాట్లాడారు. 40 నెలలు పీఆర్సీ ఆలస్యం కావడం గతంలో ఎన్నడూ లేదని విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో నెలకొన్న అసంతృప్తిని తొలగించాలంటే తక్షణమే పీఆర్సీ ప్రకటించాలని కోరారు. సీపీఎస్ రద్దు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిర్ణీత కాలపట్టిక రూపొందించాలని డిమాండ్ చేశారు. ముందుగా ఉద్యమ పతాకాలను ఆవిష్కరించి, పూర్వ అధ్యక్షుడు నాగటి నారాయణకు నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా కేవీ కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా బానోత్ మంగీలాల్, ఉపాధ్యక్షులుగా ఆర్ నాగలక్ష్మి , ఎస్ పవన్ కళ్యాన్, కోశాధికారిగా ఏటుకూరి నాగేశ్వరరావు, మండల ఆడిటర్ దార రాంబాబు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ మద్దినేని నాగేశ్వరరావు, కార్యదర్శులుగా పీ రామారావు, జి సంతులాల్, ఎన్ శివకోటి, కె నరేంద్ర, ఎ సుజాత, జి కిరణ్, బి బాలకృష్ణ, ఎస్ స్రవంతి, జి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మహాసభలో జిల్లా నాయకులు రాందాస్, రాంబాబు, ఉద్దండ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# హీరాలాల్ మోరియా పుస్తకావిష్కరణ



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ తొలితరం ఉద్యమ రచయిత, కవి, హీరాలాల్ మోరియా అని వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాదనాల వెంకటస్వామి నాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ప్రముఖ కవి, రచయిత ఎన్. తిర్మల్ రాసిన తపస్వి మనోహరం ప్రచురించిన ''త్రిభాషా కవి హీరాలాల్ మోరియా'' పుస్తకాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుండి ఉపన్యాసకుడుగా, ఉద్యమకారుడుగా, పాత్రికేయుడుగా, బహుముఖ పాత్ర నిర్వహించిన మోరియా మూడు భాషల్లో కవిత్వం, కథలు, వ్యాసాలు, నవలలు రాసిన మహా రచయితగా కీర్తించారు. బహుబాషా రచయితగా మోరియా దేశ వ్యాప్తంగా కీర్తి గడించారన్నారు. హీరాలాల్ మోరియా ఉర్దూ రచయితల్లో గుర్తింపు కలిగిన రచయిత మాత్రమే గాక తెలుగు, హిందీ భాషా సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఖమ్మం జిల్లా సాహిత్య ఉద్యమానికి హీరాలాల్ మోరియా ఎనలేని సేవలు అందించారన్నారు. ఖమ్మంజిల్లా రచయితల సంఘానికి అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేయడంతో పాటు ఖమ్మం నుండి ఆయన శాసనమండలి సభ్యుడిగా, సాహిత్య అకాడమీ సలహాదారుగా అనేక సామాజిక, సాహిత్య సేవలు అందించారన్నారు. ఆయన రాసిన షాకే గుల్, జాకమ్ బోల్తాహై, ఉర్దూ కవితా సంకలనంతో పాటు ఉర్దూలో రామాయణం రెండు సంపుటాలు రాసి ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారన్నారు. దర్దీకా పుకార్ హిందీ కథా సంకలనం, గుడిమెట్లు నవలతో పాటు ఆయన సమాంతర రేఖలు నాటకం ఎంతో ప్రశస్తి పొందిందన్నారు. వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంకు బుక్కా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సభలో అరసం రాష్ట్ర నేత పల్లెర్ల వీరస్వామి, వికాస వేదిక నేతలు లెనిన్ శ్రీనివాస్, డా।। కాసర్ల రంగారావు, తిరునగరి శైలజ శ్రీనివాస్, ప్రముఖ సాహిత్యవేత్త అమ్మిన శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి




ప్రజాపక్షం/ తల్లాడ : ప్రజాస్వామ్య విధ్వంసానికి సూత్రదారి, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి) జ్ఞానేష్‌కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశం నలు మూలల ఆగ్రహజ్వాలలు ఎగిసిపడుతున్నాయి. టిపిసిసి ఖమ్మం జిల్లా డిసిసి ఆదేశాల మేరకు సత్తుపల్లి నియోజక వర్గం ఎంఎల్ఏ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తల్లాడలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలను పారదర్శకంగా అమలు చేయడంలో కమిషనర్ విఫలమయ్యారన్నారు. అనంతరం జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ నాయకులు, మండల కమిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డుమెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇన్ఫోసిస్ సహకారంతో ఉచిత శిక్షణ, ఉపాధి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఇన్ఫోసిస్ సహకారంతో లెర్నెట్ స్కిల్స్ ఆధ్వర్యంలో ఖమ్మంలో డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉచితంగా శిక్షణ అందజేసి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు లెర్నెట్ స్కిల్స్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మత్తి రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ శిక్షణకు 18 నుండి 28 ఏళ్ల లోపు డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులన్నారు. అనుభవం కలిగిన శిక్షకులచే శిక్షణను అందిస్తామని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఇన్ఫోసిస్ వారి సర్టిఫికెట్ అందజేసి ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9912465999 ను సంప్రదించాలని కోరారు.

### ప్రజలకు సౌకర్యాలు అందించడంలో

# అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించం

**- సమీక్ష సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క**
**-స్కూళ్ల ఆధునీకీకరణ,**
**బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి**
**-మెప్మా ద్వారా మధిర పట్టణంలో**
**10వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణకై చర్యలు**



**ప్రజాపక్షం/ఖమ్మం/ఎర్రుపాలెం:** ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను హెచ్చరించారు. ఆదివారం ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా, జవాబుదారితనంతో ప్రజలకు సేవ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. త్రాగునీటి సమస్య వస్తే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మధిర నియోజకవర్గంలో 9 స్కూళ్లను ఆధునీకీకరించి అన్ని సదుపాయాలతో మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దాలని, రూ.59.67కోట్లను మంజూరు చేశామని, ఆధునీకీకరణ, సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేసి, విద్యార్థులకు త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బ్రిడ్జిల నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని సులభతరం చేయాలన్నారు. బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యమైతే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని 10వేల మంది మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి కల్పించేలా నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం అన్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న పనుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. రహదారుల విస్తరణ, వివిధ అభిబుద్ధి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంభాల తరలింపు పనులు వేగంగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్థంభాల తొలగింపు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్థంభాల తొలగింపు పనులతో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. భూ రీ సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రజా ఫిర్యాదులకు తావులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని డిప్యూటీ సిఎం అన్నారు. రీసర్వే ప్రక్రియ తర్వాత రికార్డుల నమోదు జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని డిప్యూటీ సిఎం దిశానిర్దేశం చేశారు. ఈసమావేశంలో ఎన్పిడిసిఎల్ డైరెక్టర్లు టి.మధుసూదన్, వి.మోహన్‌రావు, సిఈ గౌతంరెడ్డి, ఎస్ఈ శ్రీనివాసచారి, పిఆర్ఎస్ఈ వెంకటరెడ్డి, తహశీల్దార్ సునీత, ఎలిజిబెత్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని మూడో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో కీలకమైన యూనిట్ నిలిచిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి, వైఫల్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ యూనిట్ నిలిచిపోవడంతో రోజుకు 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగిందన్నారు. ఇప్పటి వరకు సుమారు 15.5 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలిగిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కీలకమైన పరికరాల నిర్వహణ, ముందస్తు తనిఖీలు, స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహించిందో సమాధానం చెప్పాలని పువ్వాడ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నిలిచిపోయిన మూడో యూనిట్‌ను వెంటనే పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో వెల్లడించాలని పువ్వాడ అజయ్‌కుమార్ ప్రశ్నించారు.

## మైనర్ బాలికపై అత్యాచార యత్నం

**-వ్యక్తిపై పోక్సో కేసు నమోదు**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్లయ్య తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మైనర్ బాలికల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సీతారామ ప్రాజెక్టు పరిధిలో ఐరన్ చోరీపై కేసు

**ప్రజాపక్షం/అశ్వాపురం:**అశ్వాపురం మండలంలోని సీతారామ ప్రాజెక్టు పరిధిలో ఐరన్ చోరీ జరిగినట్లు ప్రాజెక్టు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రాజెక్టు పరిధిలోని ఐరన్‌ను అక్రమంగా తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఐరన్ చోరీ ఎలా జరిగింది. ఎవరెవరి ప్రమేయం ఉంది, ఎవరి సహకారంతో తరలించారనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ కథా సాహిత్యం చారిత్రాత్మకమైంది..

**-తెలంగాణ సాహిత్య గుమ్మం ఖమ్మం**
**-కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత,**
**ప్రముఖ కవి డా।। నందిని సిధారెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ కథా సాహిత్యం చారిత్రాత్మకమైనది, జీవితమంత విశాలమైనదని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, రచయిత, కథకులు, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా।। నందిని సిధారెడ్డి అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు కవి, విమర్శకులు ప్రసేన్ అధ్యక్షతన వేదిక ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం కథా స్ఫూర్తి సాహిత్య ఉత్సవం సమావేశం ఆదివారం జరిగింది. ధరణికోట రమేష్‌కుమార్, ప్రసేన్, సీతారాం, రవిమారుత్ సంపాదకత్వంలో వెలువడిన 'గుమ్మి' తెలంగాణ కథా సంకలనాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కథ విస్మరణకు గురైందని వారు ఆవేదన చెందారు. తెలుగు కథలో తెలంగాణ కథా ఉంటుందని 2003లోనే తెలంగాణ కథా సంకలనాన్ని కక్రమల్లారెడ్డి వెలువరించిన నేపథ్యం ఉందన్నారు. ఆ తర్వాత సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్ సంపాదకత్వంలో తెలంగాణ కథను ముందుకు తెచ్చారన్నారు. తెలంగాణ సాహిత్య గుమ్మం ఖమ్మం తెలంగాణ తొలి మలిదశల ఉద్యమం జరిగిన ఖమ్మం నుంచి గుమ్మి కథా సంకలనం రావడం చారిత్రాత్మకమైన అంశంగా వారు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, స్థానిక కవులు, సాహిత్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కళలు ప్రజలను చైతన్యవంతం చేయాలి

**- తెలంగాణ ప్రజా నాట్యమండలి కార్యదర్శి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** కళలు కళ కోసం కాదని ప్రజల కోసం, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నిమ్మల రాంబాబు అన్నారు. సిపిఐ కార్యాలయం చండ్రా రాజేశ్వరరావు భవన్‌లో జిల్లా కమిటి సమవేశం ఆదివారం జరిగింది. ఈ సంధర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రజా కళలును ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజా సమస్యలపై, ప్రభుత్వ దోపిడీ పాలకుల తప్పుడు విధానాలపై తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులు ఆటా, పాట, నాటికలు తదితర కళా రూపాలతో ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. అవినీతి అక్రమార్కుల గుండెల్లో దప్పుదరువులై మారుమోగాలని చెప్పారు.సంస్కృతి, సాంప్రదాయాలను, ప్రజా కళలను రక్షించాలని, సామ్రాజ్యవాద విష సంస్కృతిని పారద్రోలాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ నెలలో బతుకమ్మ సంబరాల వేడుకల్లో ప్రజా నాట్యమండలి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కోశాధికారి, గౌరవ అధ్యక్షులు కాటూరి రాము, మేదిని లక్ష్మి, కనకం కొమురయ్య, దార్ల లక్ష్మి, రామడుగు రామాచారి, కోటమర్తి శ్రీనివాసరావు, జిల్లా కమిటి సభ్యులు అల్లి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి సంజీవరావు, తాటి నాగరాజు, ఇరుకు రామారావు, కేలోత్ క్రిష్ణ, కే. స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# పాండవుల గుట్టకు పూర్వ వైభవం తీసుకురావాలి

**-పురాతన ఆలయాలు, కట్టడాలను పరిరక్షిస్తాం**
**-ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ**





**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలం నల్లముడి గ్రామంలోని పురాతన పాండవుల గుట్టను అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ ప్రత్యేక బృందంతో కలిసి ఆదివానం పరిశీలించారు. చత్తీస్‌ఘడ్ దంతెవాడ ఎంఎల్‌ఏ సోదరులు సత్యనారాయణ కర్మ ఆధ్వర్యంలోని బృందం గుట్టలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించింది. పాండవుల గుట్టకు ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను గుర్తించి పురాతన ఆలయాలు, కట్టడాలను పరిరక్షించడంతో పాటు వాటి విశిష్టతను ప్రజలకు తెలియజేయాలని ఎంఎల్‌ఏ పేర్కొన్నారు. గుట్టకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా అభివృద్ధి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని, ప్రభుత్వ సహకారంతో చారిత్రక సంపదను భవిష్యత్ తరాలకు అందించేలా కృషి చేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో బత్తుల అంజి, ఎండి జహీరుద్దీన్, కారం సుధీర్, గాదె తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ అధ్యక్షుడు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 2003 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆనాటి గురువులు, పూర్వ విద్యార్థులు కలిసి రోజంతా ఎంతో సరదాగా ఉత్సాహంగా గడిపారు. ఆనాటి తమ పాత జ్ఞాపకాలను, ప్రస్తుత పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులు కిషోర్ బాబు, వెంకటరమణ, నిర్మల, జ్యోతి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ ఇప్పిస్తానని ఆర్ఎంపి టోకరా



**-పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద ఆర్థిక సాయం మంజూరు చేయిస్తానని ఆర్ఎంపి వైద్యుడు నమ్మబలికి నిరుపేద ప్రజల వద్ద నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన ఘటన రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ మోసంపై బాధితులు రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. బూడిదంపాడు గ్రామానికి చెందిన పలువురు నిరుపేదలు అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. ఇదే గ్రామంలోని ఆర్ఎంపి వైద్యుడిగా పనిచేస్తున్న తోటపల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి బాధితుల ఇండ్లకు వెళ్లి వారికి ప్రభుత్వం నుంచి సిఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయిస్తానని ఆశ చూపించాడు. అందుకోసం సంబంధిత ఆసుపత్రులకు ఫీజులు, ఖర్చులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పి బాధితుల నుంచి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 10వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. కాకనబోయిన వెంకట నారాయణ రూ. 15వేలు, వరికొల్లు నాగలక్ష్మి రూ. 10వేలు, గోళ్ల గురవయ్య రూ. 15వేలు, దేశాయి కృష్ణవేణి రూ. 15వేలు, సిలవేరు మౌనిక రూ. 20వేలు, దేవరపల్లి కౌసల్య రూ. 10వేలు, జీడిమెట్ల మంగమ్మ రూ. 15వేలు, కొత్తపల్లి భారతి రూ. 30వేలతో పాటు మరి కొంత మంది వద్ద వసూలు చేసినట్లు తెలిపారు. డబ్బులు తీసుకుని నెలలు గడుస్తున్నా అటు సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఇప్పించకపోగా ఇటు వసూలు చేసిన నగదు కూడా తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని బాధితులు వాపోయారు. ఆర్ఎంపి వెంకటేశ్వర్లుపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేసి తమ సొమ్మును తిరిగి ఇప్పించాలని బాధితులు పోలీసులను కోరారు.

# వాలీబాల్ క్రీడాకారులకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలో రెవెన్యూ ఆఫీస్ పక్కన గల వాలీబాల్ క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలని ఆదివారం తల్లాడ వాలీబాల్ క్లబ్ నేతృత్వంలో క్రీడాకారులు నిరసన తెలిపారు. తల్లాడ వాలీబాల్ క్రీడా ప్రాంగణ చరిత్ర ఇప్పటిది కాదని గత 40 ఏళ్ల క్రితమే ఆ స్థలాన్ని వాలీబాల్ క్రీడా ప్రాంగణానికి కేటాయించారని ఆనాటి ఎస్పి క్రాంతి రానా టాటా ప్రారంభించి ఫౌండేషన్ స్టోన్ చేశారని క్రీడాకారులు తెలిపారు. ప్రక్కన ఉన్న స్థలాన్ని కూడా క్రీడా ప్రాంగణాలకి కేటాయించారని కానీ ఇప్పుడు ఆ ప్రదేశాన్ని ఐకెపి బిల్డింగ్‌కు కేటాయించి అక్కడ పనులు చేపట్టారన్నారు. తక్షణమే పనులు నిలిపివేసి క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలన్నారు. ఈ ప్రాంతంలో గతంలో రెండు, మూడుసార్లు నేషనల్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్స్ జరిగాయన్నారు. ఆ టోర్నమెంట్స్‌కు నేషనల్ ఇండియన్ కెప్టెన్ వెంకట నారాయణ కూడా హాజరయ్యారన్నారు. ఎంతో మంది మహానుభావులు ఆటలు ఆడి ప్రయోజకులైన చరిత్ర ఆ స్థలానికి ఉందన్నారు. అట్టి స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోబోమని, రేపటి పౌరుల భవిష్యత్తు కోసం ఈ స్థలాన్ని క్రీడాకారుల కోసం కేటాయించాలని వారు కోరారు.

# దేశం కోసం పోరాడిన చరిత్ర ముస్లింలది..




**-తన్జీమ్ ఎ ఇన్సాఫ్ నేత సలాం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించింది ముస్లింలని ఆ రోజుల్లో పుట్టని బిజెపి, ఆర్ఎస్ఎస్ లు మమ్మల్ని ఎవరు అని అడిగే స్థాయికి మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకుని రెచ్చిపోతున్నారని సలాం విమర్శించారు. స్థానిక ఖానాపురం హవేలీ ఇన్సాఫ్ మహాసభ ఆదివారం రఫీ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో మహ్మద్ సలాం, ఖానాపురం హవేలీ సిపిఐ సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె సైదాలు మాట్లాడుతూ ముస్లింలు నిరంతరం దేశ ఐక్యత కోసం మత సామరస్యాన్ని కాపాడుతూ వస్తున్న ముస్లిం మైనార్టీలను అణిచివేస్తూ, అనేక చట్టాలు తీసుకు వస్తూ, ప్రార్థన స్థలాలను కూల్చివేస్తూ చివరికి ఓటు హక్కుని కూడా లాక్కుంటున్నారన్నారు. ఓటుహక్కు రాజకీయాలను మానేసి మైనార్టీలకు ఉపాధి అవకాశాలు, విద్య, ఇండ్ల స్థలాలు, వారి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అధ్యక్షుడు ఎస్‌కె అక్రమ్, కార్యదర్శి ఎండి జాకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ యూసుఫ్, కోశాధికారి యాకూబ్ పాషా, ఉపాధ్యక్షుడు అజీమ్, జమీరుద్దీన్, కార్యవర్గ సభ్యుడు ఫయామ్ ఫాతే మహ్మద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రఫీ లను ఎన్నుకున్నారు.

# ఎస్కేప్‌ను పునరుద్ధరించినందుకు మంత్రులకు, ఎంఎల్ఎకు ధన్యవాదాలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** సిరిపురం మేజర్ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా అన్నారుగూడెం గోపాలపేట, నర్సారావుపేట, రామచంద్రాపురం, బిల్లుపాడు, గొల్లగూడెం రైతులకు ఉపయోగపడే ఎస్కేప్‌ను సిరిపురం మేజర్ కాలువ మరమ్మతుల్లో భాగంగా తొలగించారు. దీని మూలంగా చుట్టు పక్కల ఉన్న గ్రామాల రైతులకు నష్టం జరుగుతున్నందున మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్‌కి పునరుద్ధరించాలని అన్నారుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన మంత్రులు, ఎంఎల్‌ఏ నీటిపారుదల శాఖాధికారులతో మాట్లాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఎస్కేప్‌ను పునరుద్ధరించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం సందర్శించి పునరుద్ధరించిన ఎస్కేప్‌ను, మేజర్ కాలువ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోపాలరావుపేట నాయకులు, తిరుమలయ్య, రంగ, రాఘవ, రామారావు, మోహన్‌రావు, అన్నారుగూడెం గ్రామ రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గడ్డి మందుతో గడ్డుకాలమే..!



**-కూలీల కొరతకు మందులతో చెక్..**
**-భూమి ఆరోగ్యం సంగతేంటి..?**
**-కలుపు నివారణ పేరుతో విచ్చలవిడిగా వినియోగం**
**-భూసారం, పంట దిగుబడులపై ఆందోళన**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కూలీల కొరత.. పెరిగిన కూలి ఖర్చులు.. వ్యవసాయ పనుల్లో పెరుగుతున్న భారంతో రైతులు కలుపు నివారణకు గడ్డి మందుల వైపు మొగ్గుచూపుతున్నారు. తక్కువ సమయంలో కలుపు మొక్కలను తొలగించవచ్చనే ఉద్దేశంతో రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం కలుపు సమస్యకు ఉపశమనం లభిస్తున్నప్పటికీ.. గడ్డి మందుల వినియోగం పెరుగుతుండటంతో భూమి ఆరోగ్యం, పంటల ఎదుగుదల, దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మందులను అవసరానికి మించి, సరైన మోతాదులో కాకుండా వినియోగించడం వల్ల నేల లోని సహజ జీవక్రియలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు సూచిస్తున్నారు.

### కూలీల కొరతతో పెరిగిన వినియోగం..

గతంలో పంట పొలాల్లో కలుపు మొక్కలను కూలీలతో తొలగించేవారు. పంటను బట్టి పలుమార్లు కలుపు తీసే పనులు చేయాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం వ్యవసాయ పనులకు కూలీలు అందుబాటులో లేకపోవడం, అందుబాటులో ఉన్న కూలీలకు అధిక కూలి చెల్లించాల్సి రావడంతో రైతులకు అదనపు భారం పడుతోంది. దీంతో సమయం, ఖర్చు తగ్గించుకునేందుకు గడ్డి మందులను వినియోగించడం పెరుగుతోంది. ఒకసారి మందు పిచికారీ చేస్తే కొద్ది రోజుల్లోనే కలుపు మొక్కలు వాడిపోవడంతో రైతులు ఈ పద్ధతిని సులభమైన మార్గంగా భావిస్తున్నారు. దీంతో పంట పొలాల్లో యథేచ్ఛగా గడ్డి మందుల వినియోగం పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

### పంట పొలాల్లోనే కాకుండా ఖాళీ భూముల్లోనూ

కలుపు మొక్కలు అధికంగా పెరిగిన పంట పొలాలతో పాటు ఖాళీగా ఉన్న భూములు, పొలాల గట్ల వద్ద కూడా గడ్డి మందులను వినియోగిస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కలుపు ఎక్కువగా పెరిగిన ప్రాంతాల్లో కూలీలతో తొలగించడం కష్టంగా మారడంతో రైతులు మందులపై ఆధారపడుతున్నారు. అయితే పంటకు అవసరమైన దశలోనే, సూచించిన మోతాదులోనే మందులను వినియోగించాల్సిన అవసరం ఉంది. మందు ప్రభావం పక్క పొలాలకు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవడం కూడా కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.

### భూసారంపై ప్రభావం ఉంటుందా..?

పంటల దిగుబడులకు భూమి ఆరోగ్యం అత్యంత కీలకం. నేలలో ఉండే సేంద్రియ పదార్థాలు, సూక్ష్మజీవులు పంట ఎదుగుదలకు తోడ్పడతాయి. రసాయన మందులను అవసరానికి మించి వినియోగించడం వల్ల నేల సహజ లక్షణాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే ఆందోళన ఉంది. ఒకే భూమిలో ప్రతి సీజన్‌లోనూ గడ్డి మందుల వినియోగం పెరిగితే భవిష్యత్‌లో నేల నాణ్యతపై ప్రభావం పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భూమిని కేవలం ప్రస్తుత పంటకు మాత్రమే కాకుండా భవిష్యత్ సాగుకు కూడా అనుకూలంగా ఉంచుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉంది.

### దిగుబడులపైనా ప్రభావం పడే అవకాశం..

గడ్డి మందుల వినియోగంలో మోతాదు, పంట దశ, వాతావరణ పరిస్థితులు వంటి అంశాలు కీలకం. తగిన జాగ్రత్తలు పాటించకుండా మందులను పిచికారీ చేస్తే కలుపు మొక్కలతో పాటు పంటకు కూడా నష్టం కలిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గాలి వేగంగా వీస్తున్న సమయంలో పిచికారీ చేస్తే మందు పక్క పొలాల్లోని పంటలకు చేరే ప్రమాదం ఉంటుంది. దీంతో ఒక రైతు కలుపు నివారణ కోసం తీసుకున్న నిర్ణయం పక్క పొలాల్లోని రైతులకు కూడా సమస్యగా మారే అవకాశం ఉంది. అందువల్ల మందుల వినియోగంలో అప్రమత్తత అవసరం.

# ఎన్‌టిఆర్ విగ్రహానికి లక్ష రూపాయలు విరాళం



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండల కేంద్రం రింగు రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న స్వర్గీయ నందమూరి తారక రామారావు భారీ విగ్రహం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు వనమ వాసు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాలకు, జెండా దిమ్మెలకు వాసు ఆర్థిక సాయం చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడహక్ కమిటీ సభ్యులు కొండబాల కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు కేతినేని హరీష్, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ వెంకటేశ్వరరావు, నాగార్జున శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, నాగయ్య, వెంకన్న, అజయ్, భద్రరాజు, గురవయ్య, వెంకట్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చోరీ కేసులో మూడవ నిందితుడి అరెస్ట్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పోస్ట్ ఆఫీస్ లో చోరీకి పాల్పడ్డ నిందితుడిని విఎం బంజర్ పోలీసులు అరెస్టు చేశారు. 2025 సంవత్సరంలో పెనుబల్లి పోస్ట్ ఆఫీస్ లోకి ప్రవేశించిన దుండగులు చోరీకి యత్నించారు. పోస్ట్ ఆఫీస్ లో దుండగులకు ఏమీ దొరకకపోవడంతో పక్కనే ఉన్న తాళం వేసిన ఇంటిలోకి చొరబడి బీరువాలోని రూ. 70 వేలు నగదు అపహరించారు. ముగ్గురు దుండగులు ఈ చోరీకి పాల్పడగా గతంలోనే ఇద్దరినీ అదుపులో తీసుకొని రిమాండ్ కి తరలించారు. మూడవ నిందితుడైన వేంసూరు మండలం ఎర్రగుంటపాడు కు చెందిన తుమ్మల మురళిని అదుపులో తీసుకొని రిమాండ్ కి తరలిస్తున్నట్లు విఎం బంజర పోలీసులు తెలిపారు.